క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగుల నిరసన

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులకు వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అందులో భాగంగా హనుమకొండ, వరంగల్ సర్కిల్ ఉద్యోగులు హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కేయూ క్యాంపస్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం నాటి నుంచి ఉద్యమకారులను పక్కన పెట్టి వివిధ సంక్షేమాలను అమలుచేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. మార్చి 12న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న సభకు ఉద్యమకారులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

దుబాయ్ పద్మశాలి సమ్మిట్‌లో పాల్గొన్న వరంగల్ ప్రముఖులు

వరంగల్ / నయీంనగర్ : గ్లోబల్ పద్మశాలి అసోసియేషన్ ఆధ్వర్యంలో 2రోజుల పాటు దుబాయిలో నిర్వహించిన గ్లోబల్ పద్మశాలి సమ్మిట్‌లో గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణితో పాటు వరంగల్‌కు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సమ్మిట్‌లో ఎమ్మెల్సీ ఎల్.రమణ, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్, వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, బీజేయూ నాయకులు వేముల సదానందం, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఆడెపు రవీందర్ పాల్గొన్నారు.

'సేవాలాల్ ఉత్సవాలు' వాయిదా

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర సేవాలాల్ మహారాజ్ జయంతి ముగింపు ఉత్సవాలు ఈనెల 28న కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించాల్సి ఉండగా వాటిని వాయిదా వేస్తున్నట్లు టీటీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోతు వెంకన్ననాయక్, అధ్యక్షుడు నేతావత్ రవీందర్ తెలిపారు. కేయూ గెస్ట్‌హౌస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. వైద్య విద్యార్థి ధరావత్ ప్రీతి మృతి కారణంగా వాయిదా వేస్తున్నట్లు వివరించారు.

వ్యాపారవేత్తలుగా ఎదగాలి

విద్యారణ్యపురి: యువత ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా మారాలని మైక్రో స్మాల్ మీడియం (ఎంఎస్ఎం) అభివృద్ధి సంస్థ హైదరాబాద్ సంయుక్త సంచాలకులు ఎం.నవీన్‌కృష్ణ సూచించారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాలలో ఈడీ సెల్, ఐక్యూసీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఒక రోజు వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపన ద్వారా విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా, యాక్టివిటీస్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, ఈడీ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ వినోద్‌రావు, వంశీకృష్ణ, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ప్రజావాణికి 103 వినతులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు 103వినతులు అందాయి. కలెక్టర్ ఇతర కార్యక్రమాల్లో ఉండడంతో పరకాల ఆర్డీఓ రాము వినతులు స్వీకరించారు. తహసీల్దార్ కార్యాలయాలకు సంబంధించి 23, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ 16, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ 13, కలెక్టరేట్ డి సెక్షన్ 6, ఎంపీడీఓస్ 5, ఏసీపీ కాజీపేట 5తోపాటు వివిధ శాఖలకు కలిపి 103 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ఏఓ కిరణ్ ప్రకాశ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవిలత, డీడబ్ల్యూఓ సబిత, జీఎం ఇండస్ట్రీస్ హరిప్రసాద్, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలి

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ సబార్డినేట్ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ (టీఎస్ఎస్‌ఓఎస్) వరంగల్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పసునూరి ప్రసాద్, సుద్దాల సుకుమార్‌లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కొన్ని నెలలుగా ఉద్యోగులకు వేతనాలు 1వ తేదీన కాకుండా 11వ తేదీ లోపు ఏ రోజున వస్తున్నాయో కచ్చితంగా తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆయుర్వేదంతో రోగాలు దూరం

హసన్‌పర్తి: ప్రాచీన ఆయుర్వేదంతో దీర్ఘకాలిక రోగాలు దూరమవుతాయని కార్పొరేటర్ అరుణకుమారి అన్నారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్, విద్యారణ్యపురి, గోపాలపురం ఆధ్వర్యంలో ఒకటవ డివిజన్ ముచ్చర్లలో ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని సోమవారం నిర్వహించారు.

కేఎంసీలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మెడికోలు



హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ధర్నా చేస్తున్న గిరిజన ప్రజా సంఘాల నాయకులు, గిరిజన విద్యార్థులు



వరంగల్ ఎస్ఆర్‌నగర్‌లో కొవ్వొత్తులను ప్రదర్శిస్తున్న మహిళలు



మెడికో ప్రీతి మృతికి ప్రగాఢ సంతాపం

డాక్టర్ ప్రీతి మృతికి నగర వ్యాప్తంగా పలువురు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి సోమవారం నివాళులర్పించారు. రాత్రి కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. నిందితులను శిక్షించాలని సూచించారు.

\- సాక్షి నెట్‌వర్క్



రెడ్‌క్రాస్‌లో నివాళులర్పిస్తున్న పాలకవర్గం ప్రతినిధులు



కేయూ రెండో గేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు



అశోక జంక్షన్‌లో ర్యాగింగ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పలు సంఘాల నాయకులు



హసన్‌పర్తి: గోపాలపురంలో..



వరంగల్ ఆర్టీసీ జంక్షన్‌లో..



నయీంనగర్‌లోని వైఎస్సార్‌టీపీ కార్యాలయంలో..



హనుమకొండ చౌరస్తాలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ మహిళా నాయకులు



కాళోజీ కూడలిలో నిరసన తెలుపుతున్న జాతీయ మహిళా సమాఖ్య నాయకులు, కార్యకర్తలు



కేయూలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్, టీటీఎస్ఎఫ్ నాయకులు



హనుమకొండలోని అశోక జంక్షన్‌లో ప్రీతికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



హన్మకొండ: ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

మన్సూరాకు రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో ద్వితీయ స్థానం



మన్సూరాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, డైరెక్టర్

దేశాయిపేట: ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన ఆర్చరీ పోటీల్లో నగరంలోని స్కాలర్స్ జూనియర్ కళాశాలలో ఎంఈసీ సెకండియర్ చదువుతున్న మన్సూరా ద్వితీయ స్థానం సాధించింది. ఈమేరకు మన్సూరాను కళాశాల ప్రిన్సిపాల్ చెన్నూరి అనిల్ కుమార్, అధ్యాపకులు సోమవారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు మాడిశెట్టి అశోక్, అబ్దుల్ సలీం పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



కొమరయ్య (ఫైల్)

కాశిబుగ్గ: పొలం వద్ద పశువులకు నీళ్లు, మేత పెట్టి తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడని వరంగల్ రైల్వే పోలీసులు సోమవారం తెలిపారు. ఈఘటన వరంగల్ – చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన బొల్లం కొమరయ్య(77).. రైల్వే ట్రాక్ పక్కన ఉన్న వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి పశువులకు మేత, నీళ్లు పెట్టి ఇంటికి తిరిగి వస్తూ రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు అతన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతుడి బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



రామాచారిని సన్మానిస్తున్న అధ్యాపకులు

రామన్నపేట: ములుగు రోడ్డులోని లాల్‌బహదూర్ కళాశాలలో జాతీయ సైన్స్ డేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రసాయనశాస్త్రంలోని పరిశోధన అవకాశాలు గురించి రసాయనశాస్త్ర ప్రొఫెసర్ డీబీ.రామాచారి విపులంగా వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు మాట్లాడుతూ పరిశోధన రంగంపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విజ్ఞానం పెంపు

మామునూరు: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి ప్రదర్శనలు దోహదపడుతాయని టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ బొల్ల వేణుగోపాల్‌రెడ్డి, టీఎస్ఎస్పీ రిటైర్డ్ అధికారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఐనుగాల జోగిరెడ్డి సూచించారు. టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాగణంలోని టీఎస్ఎస్పీ బెటాలియన్ కృష్ణవేణి హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు బి.సత్యనారాయణ అధ్యక్షతన వైజ్ఞానిక ప్రదర్శన, సైన్స్ ఫెయిర్‌ను సోమవారం నిర్వహించారు.

ఆ యార్డుపైనే మక్కువ!

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి సీజన్‌లో ఉద్యోగులు, సిబ్బంది ఆ యార్డులో విధులు నిర్వర్తించేందుకు మక్కువ చూపుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెద్ద మొత్తంలో మిర్చి బస్తాలు వస్తున్నందున జీరో దందా జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. దీంతో కలెక్టర్ గోపి.. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రసాదరావును ప్రత్యేక అధికారిగా నియమించి.. ఆయన పర్యవేక్షణలో అదనంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. దీంతో మార్కెట్‌లోని సెక్షన్లలో విధులు నిర్వహించే అసిస్టెంట్ సెక్రటరీలు, సూపర్‌వైజర్లను ఆయా బృందాల్లో నియమించారు. మార్చి 31లోగా కమీషన్, ఖరీదుదారులు తమ టర్నోవర్‌లను అసెస్‌మెంట్ చేయించుకుని రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈక్రమంలో మిర్చి యార్డుల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నందున వారి కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.



లైసెన్స్ విభాగంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

'ఆజంజాహి' రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

ఖిలా వరంగల్: ఆజంజాహి మిల్లు స్థలం రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఏఐసీటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్రా ప్రతాప్ అధ్యక్షతన కార్మిక సంఘాల సమావేశం సోమవారం జరిగింది. ఈక్రమంలో ప్రభుత్వ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పలు సంఘాల నాయకులు మచ్చ రాజు, చీకటి రాజు, రాజు, బాలరాజు, యాకూబ్‌పాషా, రవి, సంజీవ, శ్యాంసుందర్, మోహన్ పాల్గొన్నారు.

వేయిస్తంభాల దేవాలయంలో ప్రముఖుల పూజలు

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయాన్ని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి, ఆయన అల్లుడు మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ పర్సనల్ సెక్రటరీ రంగస్వామి శ్రీహరి తమ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సందర్శించారు. ఈమేరకు వారికి ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, అర్చకులు ప్రణవ్, విఘ్నేష్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రత్యేక పూజలు చేశారు. వారికి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందించి మహాదాశీర్వచనం అందజేశారు. అనంతరం, వారు భద్రకాళి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ ముఖ్య అర్చకుడు నాగరాజు శర్మ మహాదాశీర్వచనం అందజేశారు.



మహాదాశీర్వచనం అందజేస్తున్న మణికంఠశర్మ

అంతర్జాతీయ న్యాయవాదులుగా ఎదగాలి



మాట్లాడుతున్న విద్యాసాగర్ గౌడ్

హన్మకొండ / విద్యారణ్యపురి : ఆదర్శ లా కళాశాల విద్యార్థులు అంతర్జాతీయ న్యాయవాదులుగా ఎదగాలని కళాశాల చైర్మన్ బూర విద్యాసాగర్ గౌడ్ ఆకాంక్షించారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో ఆదర్శ లా కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ లా కళాశాలలో చదివిన 720 మంది విద్యార్థులు పీపీఓ, ఏపీఓలుగా ఎదిగారని వివరించారు. 29 మంది జడ్జీలుగా నియామకమయ్యారని తెలిపారు. వైద్య విద్యార్థి ప్రీతి మృతిపై సంతాపం ప్రకటించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరమ్ ప్రతిభారాథోడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోఆర్డినేటర్ పెండ్యాల కొమురయ్య, ధరావత్, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి: మరమ్మతులు కారణంగా చింతగట్టు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని టీఎస్ఆర్ జూనియర్ కళాశాల, గ్రీన్‌వుడ్ స్కూల్, తేజస్వి స్కూల్, విజ్ఞాన్ స్కూల్, దత్తాత్రేయ టౌన్‌షిప్ ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరా ఉండదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు కొండా సురేఖ పాదయాత్ర

వరంగల్ చౌరస్తా: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 27వ డివిజన్‌లో మాజీ మంత్రి కొండా సురేఖ మంగళవారం పాదయాత్ర చేపట్టనున్నారు. డివిజన్‌లోని గిర్మాజీపేట కూరగాయల మార్కెట్ కొత్త బొడ్రాయి వద్ద ఉదయం 9గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ తెలిపారు.

బండా ప్రకాశ్‌ను కలిసిన శ్రీవత్స



కాజీపేట అర్బన్: శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌ను వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ కె.శ్రీవత్స సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. 31వ డివిజన్‌లోని నందిహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

హామీలు విస్మరించిన ప్రభుత్వాలు

వరంగల్: వరంగల్ జిల్లా ప్రజల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక హామీలు ఇచ్చి విస్మరించారని, కనీసం కలెక్టరేట్ కేంద్రాన్ని సైతం నిర్మించకపోవటం సిగ్గుచేటని ఎంసీపీఐ(యూ) వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర సహాయ కార్యదర్శి సుంచు జగదీశ్వర్ విమర్శించారు. భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో వరంగల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా సోమవారం నిర్వహించారు. అనంతరం, తహసీల్దార్ సత్యపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని 33 జిల్లాలుగా విభజించిన రాష్ట్ర ప్రభుత్వం.. అందుకనుగుణంగా కార్యాలయాలను ఏర్పాటు చేయలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం జిల్లాకు చేసిందేమీ లేదని ఎద్దేవాచేశారు. సమావేశంలో పార్టీ నగర నాయకులు ఐటెం నాగేష్, మాలి ప్రభాకర్, అప్పన్నపూరి నరసయ్య, శరత్ కుమార్, నరసయ్య, ఐలయ్య, నలివేల రవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రానికి ప్రభుత్వ కార్యాలయాలను తరలించాలి

ఖిలా వరంగల్: ప్రజల సౌకర్యార్థం, జిల్లా సమగ్రాభివృద్ధి కోసం వరంగల్ జిల్లా కేంద్రానికి ప్రభుత్వ కార్యాలయాలు తరలించాలని ఎంసీపీఐ(యూ) నాయకులు కోరారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని మండల కార్యాలయంలో తహసీల్దార్ ఫణికుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగేష్, మాలి ప్రభాకర్, నరసయ్య, గోరంట్ల శరత్‌కుమార్, జటబోయిన నరసయ్య, ఐలయ్య, నలివేల రవి పాల్గొన్నారు.

ముడుపులు ముట్టాయనేది అవాస్తవం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో రెగ్యులర్ కోర్సుల్లో ఫుల్‌వర్క్‌లోడుతో పనిచేస్తున్న పార్ట్‌టైం లెక్చరర్లకు కాంట్రాక్టు లెక్చరర్లుగా అవకాశం కల్పించే ప్రక్రియలో అక్రమాలు జరిగాయనేది, ముడుపులు ముట్టాయనేది నిరాధారమైన ఆరోపణలు అని కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు అన్నారు. కేయూ గెస్ట్‌హౌస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ నరేంద్ర నాయక్, డాక్టర్ తిరుణహరి శేషు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

సంక్షిప్తంగా

ఏవైఎస్ మహాసభలను విజయవంతం చేయాలి

కరీమాబాద్: హైదరాబాద్‌లో మార్చి 4న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం (ఏవైఎస్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు బొమ్మల అంబేడ్కర్ పిలుపునిచ్చారు. ఈమేరకు కరీమాబాద్‌లో మహాసభ కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో భిక్షపతి, మల్లేషం, కుమార్, భాస్కర్, రాజు, రవితేజ, రవి, రాంప్రసాద్, సారయ్య, కుమార్, సురేందర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ 37వ డివిజన్ ఖిలా వరంగల్ మధ్యకోటలోని మైనార్టీ వీధిలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణతో కలిసి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

కాజీపేట: కాజీపేట పట్టణంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని డిప్యూటీ లేబర్ కమిషనర్ సామ్యూల్ ప్రారంభించారు. 102 మందికి సీఎస్‌సీ హెల్త్‌కేర్ సిబ్బంది 36రకాల వైద్య పరీక్షలు చేసి రిపోర్టులను అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు యమడాల అనుకాంత్, జాన్, దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి సూచించారు. డివిజన్‌లోని మహిళా కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం సందర్శించి పరిశీలించారు. డాక్టర్ భరత్, డాక్టర్ ఆకాంక్ష, సీఎంఎస్ రమేష్, సీఓ అలీ, నాయకులు పాల్గొన్నారు.

నిధులు ఇవ్వండి.. స్థలం ఇస్తాం..

హసన్‌పర్తి: పశు వైద్యశాలకు భవనానికి ప్రభుత్వం నిధులు ఇస్తే.. తాము స్థలం కేటాయిస్తామని కార్పొరేటర్ జక్కుల రజిత అన్నారు. 55వ డివిజన్ భీమారంలో మూగ జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని కార్పొరేటర్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ ఆస్పత్రి లేకపోవడంతో గొర్రెలు, మేకల కాపరులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

హసన్‌పర్తి: మెడికో విద్యార్థిని ప్రీతి శవానికి ఐదు రోజుల పాటు ఆస్పత్రిలో ట్రీట్‌మెంట్ చేశారని మాజీ మార్తినేని ధర్మారావు ఆరోపించారు. ఈక్రమంలో బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని సూచించారు. డాక్టర్ ప్రీతి మృతికి నిరసనగా ఏబీవీపీ కార్యకర్తలు ఇచ్చిన మెడికల్ కళాశాల బంద్‌ను పోలీసులు భగ్నం చేశారు. ఈమేరకు కార్యకర్తలను అరెస్ట్ చేసి హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా హసన్‌పర్తిలో ఉన్న ఏబీవీపీ కార్యకర్తలను మార్తినేని ధర్మారావు, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, స్థానిక కార్పొరేటర్ శివకుమార్ పరామర్శించారు.

శాస్త్రోక్తంగా అనఘాష్టమి వ్రతం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో అనఘాష్టమి వ్రతపూజను సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి శివరామకృష్ణ చార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మహిళలు పూజ సామగ్రితో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వ్రతం చేశారు.

రైల్వే నాయకులకు స్వాగతం

కాజీపేట రూరల్: రైల్వే మజ్దూర్ యూనియన్ జాతీయ నాయకులకు స్థానిక నాయకులు కాజీపేట జంక్షన్‌లో సోమవారం స్వాగతం పలికారు. రైల్వే కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని చేపట్టిన చలో డోర్నకల్ సింహగర్జనకు మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోన్ జనరల్ సెక్రటరీ సీహెచ్.శంకర్‌రావు, ట్రెజరర్ మురళి, ఆఫీస్ బేరర్స్ సత్యనారాయణ, నాయకులు బయలుదేరి వెళ్లారు.

శ్రీచైతన్యలో ఫ్యామిలీ గ్లోరి సంబరాలు

వరంగల్: కాశిబుగ్గ ఎల్బీనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న స్మార్ట్ లివింగ్‌లో భాగంగా ఫ్యామిలీ గ్లోరి సంబరాలను సోమవారం నిర్వహించారు.

ఆకట్టుకున్న ఫ్లాష్ మాబ్



ఫ్లాష్ మాబ్ చేస్తున్న విద్యార్థినులు

మామునూరు: ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 1నుంచి 4వ తేదీ వరకు జరగనున్న టెక్నో క్రాఫ్ట్ –2023 సందర్భంగా విద్యార్థులు సోమవారం ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. వారు ప్రత్యేక దుస్తుల్లో హాజరై డ్యాన్స్ చేసి ఆకట్టుకున్నారు. అనంతరం టెక్నో క్రాఫ్ట్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ శశిధర్, డాక్టర్ శ్రీనివాస్, సలీమ్, సంతోష్, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.